# ఎన్నికల నిబంధనలు పాటించాలి

### సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 12 : జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాల్సిందేనని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఇంజినీరింగ్ శాఖలు చేపట్టిన వివిధ పనుల్లో గ్రౌండింగ్ పనులు జరుగుతున్న యెడల, ఆయా పనులను చేయవచ్చున్నారు. కొత్తగా ఎలాంటి పనులకు గ్రౌండ్ చేయరాదని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. ఆయా శాఖల వారీగా చేపట్టిన పథకాల పనులు పూర్తయినవి, ప్రారంభమై పురోగతిలో ఉన్నవి, ఇంకా గ్రౌం డింగ్ కాని పనుల వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ర్యాంపు ఉండాలని, తాగునీటి సరఫరా సమస్యలు ఉంటే రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, నగేశ్, రవీందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

# అభ్యర్థి ఖర్చు వివరాలు..
# రిజిస్టర్‌లో నమోదు చేయాలి

### మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రాజర్షిషా, పార్టీల ప్రతినిధులు

మెదక్‌రూరల్ అక్టోబర్ 12 : అభ్యర్థి ఖర్చుపై ఎన్నికల నియమావళి సెక్షన్‌డీలో స్పష్టంగా పేర్కొన్నామని, ఆమేరకు రోజువారి ఖర్చు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా రాజకీయ ప్రతినిధులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లతో కలిసి చర్చించారు. అభ్యర్థి చేసిన ప్రతి ఖర్చును లెక్కలో చూపాలన్నారు. సభలు, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతి, ప్రకటనలు, కరపత్రాలు పోస్టర్ల ముద్రణకు సంబంధించి అనుమతి పొందాలని సూచించారు. వాహనాల వినియోగంపై అనుమతి పొందాలని సూచించారు. అభ్యర్థి నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసి ఫార్మ్-26 అపిడవిట్‌లో తప్పనిసరిగా అన్ని అంశాలు పూరించాలని స్పష్టం చేశారు. వ్యయ నియంత్రణకు సంబంధించిన బుక్‌లెట్‌లో పాటు షామియానా, కుర్చీలు, బల్లలు, మైకు,వాహనాల అద్దె తదతర వాటికి సంబంధించి నిర్ధారించిన రేట్ కార్డు ప్రతులను అందజేస్తూ, ఆ ధరలపై రాజకీయపార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్నారు. అదేవిధంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియో ప్రకటనలకు సంబంధించి సమాచార శాఖ నిర్ధారించిన రేట్ కార్డులను వారికి అందజేశారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలను తనిఖీ చేస్తామని, క్షేత్రస్థాయిలో స్క్వాడ్ బృందాలు పనిచేస్తాయన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎండిన చెరువులు నిండినయ్..




2005 సంవత్సరంలో కూలీకోసం వలస వెళ్తున్న మహిళలు (ఫైల్)




కాళేశ్వరం జలాల రాకతో సొంత పొలంలోనే నాట్లు వేస్తున్న మహిళలు

- నాడు పనుల కోసం వలస
- నేడు సొంత పనులు ఊర్లలోనే..
- మిషన్ కాకతీయ, కాళేశ్వరం జలాలతో మారిన బతుకులు
- సీఎం కేసీఆర్ సార్‌ను మరువం

రామాయంపేట, అక్టోబర్ 12 : నాడు కూలీ కోసం మా స్వగ్రామం నుంచి 40 కిలోమీటర్ల దూరం పత్తి చేనుల్లో పత్తి ఏరేందుకు వెళ్లేవాళ్లం. ప్రతిరోజు ఆటోలు తీసుకుని సద్దిమూట కట్టి వలస కూలీలుగా పనుల కోసం వేచి చూసేటోళ్లం. అలాంటిది మా ఊరు మెదక్ జిల్లా రామాయంపేట మండలం బచ్చురాజుపల్లి, రాయిలాపూర్ గ్రామాల వరకు సీఎం కేసీఆర్ కాళేశ్వరం జలాలను తీసుకొచ్చిండు. అవి మా ఎండిన చెరువులను నింపినయ్. ఇప్పుడు మా సొంతూర్లోనే హాయిగా మా సొంత పొల్లాల్లో పనులు చేసుకుంటున్నామని, అప్పట్లో వలస వెళ్లిన కూలీలు తెలిపారు. గురువా రం రామాయంపేట మండలం రాయిలాపూర్, బచ్చురాజుపల్లి గ్రామాల్లోకి వెళ్లి కూలీలను 'నమస్తే తెలంగాణ' పలుకరించగా, ఈ విషయాన్ని వెల్లడించారు. అప్పట్లో కూలీకి వెళితే రోజుకు ఆటోకు కిరాయి పోగా, చేతికి రూ.20 వచ్చేవి. ఇప్పుడు అలాంటి బాధలు లేవు. ఎక్కడెక్కడి నుంచో పారుకుంటు కాళేశ్వరం జలాలను సీఎం కేసీఆర్ సార్ మా ఊరికి తెచ్చిండు. ఇప్పుడు ఆ నీళ్లే మాకు బతుకునిస్తున్నయ్ అని గ్రామస్తులు పేర్కొన్నారు.

# ఈవీఎం గోడౌన్ పరిశీలన

మెదక్ రూరల్, అక్టోబర్ 12 : మెదక్ జిల్లాలోని ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని రీతిలో ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో మెదక్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఎ. హర్దీప్ సింగ్, పార్టీల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# గంటలోపే యూటర్న్

### మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ కండువా కప్పి..



అల్లం నవాజ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన రాంరెడ్డి

మునిపల్లి, అక్టోబర్ 12 : కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మాయ మాటలు చెప్పి.. బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్పించుకుంటున్నట్లు మునిపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అల్లం నవాజ్‌రెడ్డి అన్నా రు. గురువారం మునిపల్లి మండలంలో పర్యటించిన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన గోవింద్‌గారి రాంరెడ్డికి తాటిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ కండువా వేశారని రాంరెడ్డి చెప్పినట్లు అల్లం నవాజ్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీలో చెరిన గోవింద్‌గారి రాంరెడ్డి సాయంత్రం అల్లం నవాజ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అల్లం నవాజ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాయ మాటలకు నమ్మి మోసపోయే వారు ఎవరూ లేరన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎస్సీసెల్ నాయకులు కొల్లురు రవి, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ వడ్డిస్తున్న జడ్పీ సీఈవో వెంకట శైలేశ్

# ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

మెదక్ రూరల్, అక్టోబర్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిం చే లక్ష్యంతో ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టిందని జడ్పీ సీఈవో వెంకట శైలేశ్ అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల బ్రేక్‌ఫాస్ పథకం అమలు చేసింది. గురువారం జడ్పీ సీఈవో, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠంతో కలిసి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అమలవుతుందా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.